# పురిటినొప్పులు

కో.... ఓ.... అని కోడి కూసింది తూరుపు కొండమీద వేగుచుక్క తొంగి చూచింది, కన్నయ్య పైకి లేచాడు ఒక్కసారి గుండెలను ఆవేదనాగ్ని జ్వాలలు దహించివేశాయి, బ్రతికే వుంటారా ? ఏమి జరిగిందో!.... కన్నులు పులుముకొంటూ పెరటి వైపు వెళ్ళాడు. పిల్లికూన దారి కడ్డుతగిలి తప్పుకొన్నది. ముంతెడు నీళ్ళు ముంచుకొని ముఖం కడుక్కున్నాడు, చిక్కుడు పందిరినుండి మంచు చుక్కలు టపటప రాలు తున్నాయి మళ్ళీలోపలకు వచ్చి దుప్పటి కప్పుకొన్నాడు. బుడిగెలో వున్న వెండి పావలా తీసి పంచె కొసలో ముడిపెట్టుకొని బయలుదేరాడు,

వేగుచుక్క పొడిచినా వెలుతురింకా బాగా ప్రసరించలేదు, కాళ్ళకు చెప్పులు లేకపోవడం వల్లా పల్చని గులకరాళ్ళ జిడుములో ముళ్ళను పొదిగినట్లుంది అడుగడుగునా బాధకలుగుతోంది. శనిగె చేనివద్ద పడుకున్న పాపయ్య పలకరించాడు, ఎలా ఉంది కన్నయ్యా చింతాయమ్మ కని "దానికేంలే మామా! అసలు నానమ్మ ఎలా ఉందోనని భయంగా ఉందన్నాడు" కన్నయ్యకు చింతాయమ్మ విషయం కంటె నానమ్మ విషయంలోనే ఎక్కువ ఆతురతగా ఉండడం పాపయ్యకు ఆశ్చర్యంగా వున్నా ఇతడేమీ బదులుచెప్పలేదు. కన్నయ్య గబగబా నడిచిపోతున్నాడు ఆ దారి మలుపులో బండమీద నడిచిపోతుంటే దబ్బణం లాంటి ఈతముల్లు కుడికాలిలో గుచ్చుకొన్నది. ముల్లు తీయగానే గరిటెడు పచ్చి నెత్తురు బండను తడిపివేసింది. రెండు నిమిషా లక్కడే కూలిపోయాడు ఆ ప్రక్కన పొదరింటిలో నుండి ఒక ఉడత బైటికి వచ్చి కన్నయ్యను చూచి కితకితలాడింది, బహుశా దాని భాషలో "అయ్యో! ముల్లు గుచ్చుకొన్నదా! ఎంత బాధగా ఉందో" అని అడుగుతున్న దేమో అన్నట్టుందా ఉడత తాపత్రయం. కన్నయ్య

కాలాగా ముల్లుగుచ్చుకోవడం అలవాటు. ఏరా కుమారుడో ఏ వెండితెర మీదనో అతని ప్రేయసికోసం విరహవేదన పడుతూ అడవిలో నడిచిపోతుంటే ఏ పల్లెరుగాయ లాంటి చిన్నముల్లో పాదానికి గుచ్చుకొంటే ఏడు చెరువుల కన్నీరు కార్చే కరుణా పూరితులున్న ఈ దేశంలో అనుదినం అలకాస్తూ ప్రతిక్షణం ముళ్ళ డొంకల్లో తిరుగుతూ కనీసం గడియకో ముల్లు త్రొక్కుతున్న వారినిగురించి ఆలోచించే వ్యవధిలేదు. ఈ లాంటి వ్యవధిలేకనే కన్నయ్యకు వచ్చిన ఆపదనుగురించి కామందు బ్రహ్మయ్య పట్టించుకోలేదు. అప్పు క్రిందైనా ఒక అణా కానివ్వలేదు తుదకు ఆ మంచం పట్టిన అప్పుల్ని చూచివస్తానన్నా అనుమతించలేదు: ఐనా ఆనాడు కన్నయ్య సాహసించాడు ఉద్యోగులు భయపడాలి, ఊళ్లేలేవారు భయపడాలి. కూలివారెందుకు భయపడాలి? ఈ కామందు కాకుంటే మరో కామందువద్ద కుదురుకోవచ్చు చచ్చిన గొర్రెలు అగ్నికి వెరచినా వచ్చే లాభం లేనట్లే గూడూ కూడూ లేని కూలీలు శ్రీమంతులకు దాసోహమన్నా నిష్ఫలమే ననుకున్నాడు

కన్నయ్య పైకిలేచి నడువబోయాడు. కుడి కాలు నేల కానడంలేదు. ఏ పన్నని నలుసోతగిలినపుడు కలుక్కుమంటూ ప్రాణం పోతున్నంత బాధగా వుంది. అతని కా బాధక్షణికమే. అస లతని మనస్సు నానమ్మమీద పడిపోయింది. నానమ్మ నాలుగేళ్ళ పాపగా ఉన్నప్పుడే అమ్మ చనిపోయింది అనాటినుండి చెల్లని వేయికళ్ళతో కనిపెట్టుకుంటున్నాడు కన్నయ్య "ఆమెను పెంచి పెద్దదయ్యాక ఒకయ్యకు ముడిపెట్టి ఒక ఇంటి దానినిగాచేసి ఆ ఇంట్లో లక్షణంగా దీపం వెలుగుతున్నపుడు నువ్వు పెళ్ళి చేసికో కొడుకా" అని చెప్పి ఆ వెనుక అరగడియకు ఊపిరి విడిచింది అమ్మ. అమ్మ చెప్పిన మాటలు ఆ మాటలు చెబుతున్నపుడు ఆమె నయనాలనుండి చిప్పిలి ముడుతలు పడ్డచెక్కిళ్ళలో ఇంకిపోయిన కన్నీటి కెరటాలు.... ఆ చూపులలో కన్పించిన విశ్వాసం ... "అలాగే నమ్మా" అని తా నన్నపుడు ఆమె ఎండిన అధరాలపై కన్పించిన వెన్నెల వెలుగులు—కన్నయ్య మరచిపోలేదు: మరువలేదు,

అందుకే పది సంవత్సరాలు నానమ్మను నయనాలకు ప్రత్తివత్తులు పెట్టుకొని కనిపెట్టు కొంటూ వచ్చాడు, ఒకరింటికి పంపకుండా, ఒకరి చేతిక్రింద పెట్టకుండా గారాబంగా పెంచాడు పగలంతా పశువుల కాచినా రాత్రిపూట కూలీకి వెళ్ళేవాడు వెన్నెల రాత్రులలో గడ్డిని త్రొక్కించడం .. మోట తోలడం.... బరువులు మోయడంవంటి భారమైన పనులుచేసి ఆ వచ్చిన డబ్బులతో బట్టలుతీసి ఇచ్చేవాడు· మధ్యాహ్నం తనకోసం చిక్కంలో పెట్టిన ముద్ద సంగటిలోనూ సగం వంతుతీసి నానమ్మకు ఉంచి వేళ్ళేవాడు,

నానమ్మ నల్లగా వున్నా ఆమె నడిచి పోతుంటే పచ్చని మయూరం నృత్యం చేస్తూ వెళ్ళినట్లుంటుంది· ఆమె స్వరంలోకూడా ఒక ప్రత్యేకత ఉంది. వలభై మంది ప్రక్కవాయిద్యాలు వాయిస్తుంటే పెదిమల కదిలిస్తూ మధుర గాన విశారద లనిపించుకొన్న కోకిలమ్మలున్న ఈ లోకం ఆమె మధుర గానాన్ని గుర్తించలేదనే బాధ ఆమెకు లేదు ఆమె చక్కగా పాడుతుందిగాని ఆ పాటకు ప్రతిఫలం కోరదు, అలాంటి వర్తకం ఉన్నదనికూడా ఆమెకు తెలియదు నానమ్మకు వందలాది పాటలు వచ్చు వాటిలో ఎక్కువభాగం గొబ్బి పాటలు వెన్నెల పాటలలో దాదీదామర మొగ్గ పాట ఆమె పాడితే వినీ మళ్ళీ పాడుకునే వాడు కన్నయ్య· అతని కాపాట వినకుంటే నిద్రపట్టదు· సన్నని సెలయేరు నాగుపాములా మెలికలు తిరుగుతూ పారిజాతాల పరిమళాలను పంచుతూ తిన్నగా యిసుక తిన్నెలను ఒరుచుకుంటూ ఒయ్యారంగా సముద్రుని ఒడిలో వాలినట్లుంటుందామె పాట,

"ఎంత పాటగత్తె ఈ పిల్ల లచ్చిమికి ఏ పుణ్యాత్ముడున్నాడో·" అనేవారు ఇరుగు పొరుగు ఇల్లాండ్రు·

ఆ పుణ్యాత్ముడు గూడా ఒక శుభ ముహూర్తాన అడుగుపెట్టాడు. ఆస్తి పాస్తులు లేవు. ఉన్నవారు దొరకుతారని గూడా కన్నయ్య ఆశించలేదు ఉండ డానికి మూడంకణాల ఇల్లుమాత్రం ఉంది రోజూ చేరెడు పాలిచ్చే గేదెకూడా

ఒక్కటుంది, కమ్మలు మాత్రం వేశాడు నానమ్మకు కన్నయ్య ఒక్క జత సన్నని మాటీలు చేయించాడు. పెళ్ళి మామూలుగానే జరిగిపోయింది వివాహం ఐన మూడు మాసాలవరకూ అతడు ఇంటివద్దనే ఉన్నాడు

ఒక సోమవారం సంతకు వెళ్ళివస్తానని చెప్పి వెళ్ళినవాడు మళ్ళీ తిరిగి రాలేదు, ఒక్కవారం గడచినా అతని జాడే తెలియలేదు చివరికి రెండు మాసాలకు కాశ్మీరంనుండి ఒకజాబు వచ్చింది ఆ జాబులో తాను మిలిటరీలో చేరి పోయానని వ్రాశాడు అప్పుడే చిగుళ్ల తొడిగి యెండలో మిలమిల లాడు తున్న బంగారువన్నె ఆకులతో విరిసీ విరియని మొగ్గలతో కులుకుతున్న నంది వర్ధనం కూకటి వ్రేళ్ళతో పెకలించబడింది నానమ్మ నాటినుండి పాడటం మాను కొన్నది కోకిలకంఠంలో గుచ్చుకొన్నది ఈతముల్లు. ఆ బాధ గుండెలదాకా వెళ్ళి గూడు కట్టుకొన్నది నరనరానికి వ్యాపించి తన ప్రాబల్యాన్ని విస్తరింప జేసుకొన్నది. ఆమె ఇల్లు విడిచి కదలడం లేదు. ఆ స్థితిలోనే పట్టుబట్టి తన అన్నను ఒప్పించి చింతాయమ్మను చూచి మెప్పించి ఇద్దరికీ ముడిపెట్టింది. ఆ పెళ్ళివరకూ ఇంటికీ వాకిటకూ నడయాడుతున్న నానమ్మ ఆ వెనుక మంచం పట్టింది.

బారెడు పొద్దెక్కింది. అంతవరకూ మంచు దుప్పట్లను ముసుగుదన్ని పడుకున్నట్లు కన్పించిన కొండల వరుసలు పైకిలేచి ఆవలిస్తున్నట్లుగా ఆ శిఖరాలపై పొగమంచుల వలయాలు మేఘాలలో కలిసి పోతున్నాయి. కన్నయ్య ఆలోచనల తెరలు ఒక్కసారిగా ఆగిపోయాయి. తగిలిన కాలికే దెబ్బ తగులుతుందన్నట్టు ముల్లు గుచ్చు కొన్న కాలికే మరో ముల్లు గుచ్చుకొన్నది. ఇది ముందుదానికంటే పెద్దది. ఆలోచనలో అత డొక్కొక్కసారి జడుమును తప్పించి నడిచిపోతున్నాడు. అలా నడవడములో బొటన వ్రేలికి దిగువ పొడుచుకొన్నదో నల్లతుమ్మముల్లు, దానిని లాగడానికి చేసిన ప్రయత్నం వ్యర్థమైంది సగానికి సగం పాదం లోపలే నిలిచి పోయింది, బొటనవ్రేలిని అరచేతితో ఒత్తిపెట్టుకుని కూచున్నాడు. ఈమారతని ధ్యాస చింతాయమ్మపై పడింది.

"నిజానికి చింతాయమ్మ ఎంత మంచిది! చింతా....అనగానే చెంతకువచ్చి గలగలమని నవ్వుతుంటే ఎంతటి చింతయైనా వీడిపోతుండేది. ఇంటిలో అడుగు పెట్టినప్పటినుండే తన ఆడబిడ్డతో ఒక్కనాడైనా పేచీ పడలేదు, కలిగింది తిని గుట్టుగా కాపురంచేసే సంసారిబిడ్డ. తానుపెట్టగలిగిన బంగారు ఒక్క మంగళ సూత్రానికే నైనా తనకు సొమ్ములు చేయించలేదని కాని కనీసం చేయించాలని గానీ ఒక్కనాడూ అడిగిన పాపాన పోలేదు. నిండుమనిషి ఐనా నెలలు పూర్తిగా నిండకముందే ఈ నొప్పులేమిటి? కలికాలం .. అమ్మ చెబుతుండేది ఏ పొలం లోనో పని చేస్తూ ఏ చెట్టుక్రిందికో వెళ్ళి సుఖంగా ప్రసవించేవారట ముందు కాలంలో, పొద్దున తట్టెడు ఎరువు పొలానికి తీసుకెళ్ళి వస్తూవస్తూ బిడ్డను చంకన వేసుకవచ్చేవారట, మరికొందరు ఇల్లాండ్రు, ఇప్పుడూ ఎందరులేరలాగా! మొన్ననే పాపయ్య మరదలు రాగి కోతకోస్తూ నొప్పులు పడింది. పది నిమిషాల కల్లా పండంటి మగ శిశువునుకన్నది అయితే పాడు దేవుడుకూడా నామీదేపంతంబట్టాలి? ఏ వంద ఎకరాలున్నవాడో ఏ నాలుగు పాదుల ఫలితాన్నో ఏడుకొండలవాడికి విడిచి పెడుతాడు గాని నాబోటివాడేమిచ్చుకోగలడు? సందేహంలేదు, భగవంతుడు కూడా పగసాధిస్తున్నాడు,"

అనుకొంటూ మోకాటిమీద చేతులు ఆన్చి పైకిలేచాడు కన్నయ్య, ఎండ వేడితోపాటు అతని పరుగువేగం కూడా హెచ్చింది. రెండుమైళ్ళు నడిచేలోగా భద్రయ్యకుంట వచ్చింది ఆ కుంటదగ్గరే ఆస్పత్రికి వెళ్ళిననాడు బండిని ఆపి చెల్లెలకూ భార్యకూ చద్దన్నంతినిపించాడు. ఆ చల్లని నీడలోగంటకాలం అలసటతో నిద్రపోయింది చింతాయమ్మ ఆమె నిద్రపోతుంటే ప్రక్కన కూచున్న నానమ్మ "ఏం భయపడకన్నా! ఏల్యామో డున్నాడు: ఒదినె కడుపులో ఒక కాయ కాస్తే కళ్ళచూచి ఆనందిస్తాను నా బ్రతుకేమో తెల్లారిపోయిందనుకో" అంటూ కన్నీరు పెట్టుకొన్నది.

"ఏడవకమ్మా నాకు మీరిద్దరూ రెండు కండ్లు నీవు కుడిచేయైతే ఆమె ఎడమ చెయ్యి. మీరిద్దరూ ఆనందంగా ఉంటేనే నేనూ భూమ్మీద బ్రతుకగలను." అంటూ

తానూ శోకోద్వేగాన్ని అపుకోలేక బావురుమనబోయి చింతాయమ్మ మేలుకుంటుం దేమోనని ఆ సప్త సముద్రాలంతటి ఆ ఏడ్పుల వెల్లువలను అగస్త్యుని లాగా దిగ మ్రింగుకొన్నాడు.

ఆ వేదనా జ్వాలలకు తోడు జఠరాగ్ని నాల్కలను సాచింది కన్నయ్య ఆ కమలాల కొలనులో దిగి తనివిదీరా నాలుగు దోసిళ్లు నీళ్ళు త్రాగాడు. భగవంతుడీ లోకంలో పేదలకు ప్రసాదించింది నీరూ గాలీ కానీ నాగరికత ముదురుపాకంలో పడిన మహా నగరాలలో ఈ మాత్రం సౌకర్యమూ స్వాతంత్ర్యమూ కూడా లేదన్న విషయం కన్నయ్యకు తెలియదు. ఈ తెలియనితనంవల్లనే భగవంతునికి కృతజ్ఞత సమర్పించుకొన్నాడు. ఆ కుంటను త్రవ్వించిన తాతలనాటి వెర్రిభద్రయ్య నింకా స్వర్గంలోనే ఉంచమన్నాడు. నీళ్ళేమో త్రాగాడు కానీ ఆ చల్లని నీడలో క్షణకాలం విశ్రమించే వ్యవధి లేదు, ఆ ఇద్దరూ ఏమయ్యారో! అస్పత్రిలో చేర్పి వచ్చాక ఎక్కువైందనే కబురు అందింది ఇప్పుడెలా ఉందో వెడితేనే గానీ తెలియదు: ఇక్కడ నుండే ఏ దేవతో సాక్షాత్కరించి తక్షణం వారి క్షేమాలు తెలిపితే ఎంతబాగుండును!" అనుకున్నాడు ఈ కన్నయ్య నిజంగా పిచ్చివాడు ఆ మాత్రానికి దేవతలు సాక్షాత్కరించవలసిన అవసరం లేదని అతనికి తెలియదు. వందలాది మైళ్ళలో నున్న తమ బంధుమిత్రులతో అనుకొన్న క్షణంలోనే మాట్లాడ గల్గుతున్నాడు మానవుడు. వేలాది యోజనాల దూరమైనా గాలిలో తేలిపోయి గమ్యస్థానాన్ని గడియలమీద చేరుకుంటున్నాడు మనిషి. పాపం! అతనికా సౌకర్యాల విషయ మేం తెలుసు? సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చాడు: ఒక చెంప మాడిపోతున్నది. ఎండకు అడవిలో పది రెండామడలు నడిచి వచ్చాడు. ఇంకో ఆమడకు తక్కువ ఉండదు ఈ మారు అతి వడిగా నడక సాగించాడు.

అస్పత్రి చేరుకొన్నప్పుడు జాము ప్రొద్దున్నది ఆడవారికోసం ప్రత్యేకించిన భాగం ఏదో తెలుసుకోవడానికి పావుగంట పట్టింది. ఒక్క మంచం మాత్రం ఖాళీగా ఉన్నందున చింతాయమ్మ నానమ్మ కిమ్మని తాను వసారాలో ఉంది చింతా

యమ్మతోపాటు దిక్కులేని పక్షుల్లాగా దాదాపు ఇరవైమంది పల్లెటూరి స్త్రీలు ఆ వసారాలో మూలుగుతున్నారు: ఆ ముందు భాగంలో డాక్టరు దొరగారు దొరసానిలా ఉన్న నర్సమ్మగారూ చీట్లపేక ఆడుకుంటున్నారు. వారిని మాట్లాడించే ధైర్యమే లేకపోయింది కన్నయ్యకు, మరికొంచెం దూరంలో ఉన్నవార్డులో ఎడమ ప్రక్క ఒక కాంపౌండరూ నర్సూ చాలా అవసరమైన విషయాన్ని గురించి చర్చించు కొంటున్నారు. ఆప్రక్కనే మూలుగుతున్న దొక మానవాకారం ఆ వాతావరణంలో దిక్కూ తెన్నూ తోచక వెర్రివానిలా బిక్కరిస్తూ చూస్తున్న కన్నయ్యకు "ఏయ్? ఎవరికోసం?" అంటూ గద మాయింపు విప్పించింది, ఆ స్వరం అక్కడ పనిచేస్తున్న పాకి పిల్లది. ఆ వైద్యశాల "సేవ" అనే పునాదులతో నిర్మించినది "త్యాగమనే" గోడలతో కట్టినది ఐనా మానవత లోపించిన కారణాన ఆ ప్రాంగణమంతా కామాంధ కారమనే చీకటితో నిండిపోయింది. స్వార్థం నిలువెల్లా గల పచ్చినాగులు నడయాడు తున్నాయి. రోగుల దృష్టిలో అదొక యమలోకం....

ఒక చిన్న పిల్లేమిటి? "ఏయ్" అనడమేమిటి? బహుశా ఆ గదమాయింపు తన్ను ఉద్దేశించింది కాదనుకున్నాడు కన్నయ్య. ఒక్కడుగు ముందుకు వేశాడు, "ఏయ్ గబ్బిలం? నిన్నే? అంటూ అడ్డు వచ్చిందా అమ్మాయి,

"ఇక్కడ మావాళ్ళున్నారు, చూడాలి" అన్నాడు కన్నయ్య.

"పో....ఎప్పుడంటే అప్పుడే....విజిటర్సు టైం తెలియదూ? ఐదుగంటలకు పైన రా.... పో బైట" కసరికొట్టిం దాపిల్ల

ఇంతలో చింతాయమ్మ వసారాలోనుండే కనిపెట్టింది కన్నయ్యను ఆమె బయటకు వచ్చి ఏమో చెప్పబోతుంటే లోపలనుండి బయటకి వస్తున్న ఒక్కనర్సు "ఛీ... దారి కడ్డంతొలగు. దయ్యాలు... దయ్యాలు...." చీదరించుకుంటూ టక టకమంటూ ఆ కుడివైపునకు వెళ్ళింది. కన్నయ్య నిలబడే ఉన్నాడు, "పో

కావా లేదా?" కేకవేసింది పాకీ పిల్ల, కన్నయ్య పలుకలేదు, ఈలోగా మరో నర్సు వచ్చింది చింతాయమ్మ ఆమెను బ్రతిమాలుకొన్నది, పైకి లేవలేక దేకుతో ఆమె పాదాలు ముట్టుకోబోయింది అమె క్షణం ఆగి విషయం తెలుసుకొని కన్నయ్యను దగ్గఱకు రమ్మన్నది. కన్నయ్య సమీపించి "మీ పాదాలు పట్టు కొంటాను. రెక్కల మీద ఆధారపడ్డ పిట్టలం ఈ ఇద్దరినీ రక్షించండమ్మా" అన్నాడు

"లాభంలేదు; ఆమెకు గుండెజబ్బు. వచ్చేపోయే ప్రాణంలా ఉంది" అని ఒక క్షణం ఆగి ఇక్కడే ఉండు వస్తానంటూ లోపలకు వెళ్ళింది

కన్నయ్య చింతాయమ్మ నోసారి పరీక్షగా చూశాడు ముఖంలో జీవకళ లేదు. కను పాపలలో వెలుగు తగ్గింది. ఎనిమిది రోజుల నుండి వసారాలో పడి ఉన్నా చుక్కమందు పోసిన పాపాన పోలేదట. రొఖ్ఖంగా ఇవ్వకున్నా ఏ వ్రేలి వుంగరాలో కాలి మెట్టెలో, ముక్కుపుడకలో చేతిలో పెట్టిన వారికి మాత్రం ఆదరణ లభించిందట చింతాయమ్మ నిశ్చలంగా అన్నది, "పొరపాటు చేశాము ఇంటివద్దనే ఉండి ఏ నల్లాకో పుల్లాకో తిని ఉంటే ఇంతకు వచ్చేది గాదు, నా విషయం మఱచిపోండి, ఇక్కడ రాగిపైసా లేనిది ఎవరి ముఖమూ చూడరు. మనవద్ద నల్లపూసైనా లేదు. ఇదిగో ఈ గిన్నెబొట్టును ఐనా ఇచ్చి నానమ్మను కాపాడుకోండి."

ఈ మాటలను చెబుతూనే ఆమె మంగళ సూత్రాన్ని విప్పబోయింది. కన్నయ్య గుండెలు పగుళ్ళు విడిచాయి. కన్నీటితో "వద్దు .. వద్దు.... అలానే ఉంచు" అంటుండగానే నర్సు వచ్చింది " ఇదిగో ఈ రెండు మందులూ తీసుకరా. ఒకటి మీ చెల్లెకూ, ఒకటి నీ భార్యకూ. ఇవి లేకుంటే ఏమీ సాగదు. ఈ సాయంకాలమే వేయాలి" అంటూ చీటీ లిచ్చి వెళ్ళిపోయింది.

## 54

చింతాయమ్మ కూచుని ప్రాకుతూ కన్నయ్యను నానమ్మ దగ్గఱకు తీసుకెళ్ళింది. మంచంలో తొంగిచూచేవరకూ అక్కడ మనిషి వున్నట్టు తోచలేదు కన్నయ్యకు నానమ్మ కళ్ళుతెఱచి కన్నయ్యను చూచింది. ఏమో చెప్పాలనుకున్నది గాని పెదిమలు కదలడంలేదు ఆయాసం ఆమెను మ్రింగివేసింది చింతాయమ్మ వైపు చేతిని చాచి అన్నకు సంజ్ఞచేసింది. ఆ చూపుల భావం కన్నయ్య తెలుసుకొన్నాడు "నా ప్రాణం ఎటూ పోతున్నది వదినెను కాపాడుకో ఆమె నిండు కడుపుతో ఉన్నది" అని అంతేగాదు ఆమె మళ్ళీ ఒకసంజ్ఞ చేసింది తనవైపు ఒక వ్రేలిని చూపింది వదినెవైపు రెండు వ్రేళ్ళను చూపెట్టింది నాదొకటే ప్రాణం వదినెలో రెండు ప్రాణాలున్నాయి. గర్భంలో ఉన్న శిశువును కూడా కాపాడుకో, ఒక ఇంటివాడవుతావు అన్నా! వంశం నిలబెట్టే కొడుకు పుట్టవచ్చునని"

ఆ వెనుక ఆమె కూడా తనవద్దనున్న ఆ మాంగల్యాన్నే చూపింది ఆమెకు దానిని విప్పి ఇచ్చే శక్తిలేదు. వ్రేళ్ళు కొంకర్లు పోయాయి, విప్పుకోమన్నది, కన్నయ్య తన కళ్ళను చేతులతో కప్పుకొని అటువైపు తిరిగి నోటిలో దుప్పటి కొంగును దూర్చుకొని వసారాలోకి వచ్చి పడ్డాడు.

అతని పాదాలు అదిరిపోయినై నడుము విరిగిపోయింది. వెన్నెముక వంగిపోయింది గుండెలు నీరై వాడిన నరాలలో ఇంకిపోయింది. అతడు ఐదు నిమిషాలు పైకి లేవలేకపోయాడు, మెల్లగా ప్రాకుతూ వచ్చిన చింతాయమ్మ తన మంగళ సూత్రాన్ని అతని చేతలో పెట్టింది, ఆదురుతున్న చేయి అతి ప్రయాసతో దాని నందుకొన్నది. వార్డుముందు భాగంలో వేప చెట్టుక్రింద చీట్లపేక ఆడుకుంటున్న జంటవిరగబడి నవ్వుతున్నారు డాక్టరుగారు తురుపు ముక్కను దాచుకొని అడి పట్టుబడ్డారు, ఆ నవ్వులు కన్నయ్య కర్ణపుటాలకు వేయి ఉరుముల మ్రోతలై వినిపించాయి

"ప్రొద్దుపోతుంది, త్వరగా వెళ్ళు" అంటూ చింతాయమ్మ తొందరపెట్టింది. కన్నయ్య వసారా దాటుకొని గుడివైపు దారి తీశాడు; ఆ చివరిగేటు దాటుకుం

టున్నప్పుడు అతని పాదంలో—ఆ ముండ్లు గుచ్చుకొన్న పాదం లోనే ఒక సీసా ముక్క గుచ్చుకొంది; వంగి ఒక్క క్షణం ఆగి; ఆ ముక్కను లాగివేసే వ్యవధికానీ; ఓపికగానీ అతనికి లేదు; ఇద్దరికి మందు కావాలంటే ఇరవైనాలుగు రూపాయలు కావాలి తాళిబొట్టును అమ్మకొంటే అంత పైకమూ రాదు; పదేను రాగలితే అదృష్టమే ఈ స్థితిలో మందు ఎవరికి కొనాలి? చిన్నప్పటినుండి చేతుల మీదుగా పెంచుతూ వచ్చిన చెల్లెలికా? తనువులో సగమై తనలో లీనమైన భార్యకా? ఎవరు కావాలి? ఒక్కరే; వారెవరో తేల్చుకో అంటూ అంతరాత్మ హెచ్చరించింది ఆ దేవాలయం ముంగిట ధ్వజ స్తంభంలోని చిరు గంటలు మెల్లగా కదిలాయి అంత మృదువైన శబ్దతరంగాలను కూడా అతడు భరించలేకపోయాడు, ఇంతలో ఒరుచుకొంటూ ఒక ఆకుపచ్చని కారు దూసుక పోయింది; ఒక్క తృటిలో తప్పింది అపాయం ఆ కారు వెళ్ళినప్పుడు కొంచెంగా ఈ లోకంలో పడ్డాడు తాను వెడుతున్నది; బజారు వైపనీ; బండ్లూ; సైకిళ్ళూ లారీలూ వెడుతుంటాయనీ వాటికి హృదయాలు లేవనీ; వన్య మృగాలయినా మనిషి మీద పడటానికి జంకుతాయని; ఈ వింతశకటాలు అడ్డునిలిచిన మానవుని అమాంతంగా నలిపి వేస్తూ వెడుతుంటాయనీ; కనుక ప్రక్కగా మరీ ప్రక్కగా వెళ్లాలనీ అనుకున్నాడు

నగల దుకాణాలను చూస్తూ ఓ దుకాణం దగ్గఱ ఆగాడు: మూరెడెత్తు పడకపై గోపురం లాంటి దిండుకు తన దీర్ఘ కాయాన్ని ఆన్చికూచున్న యజమాని బేరమాడాడు; అతని లావుపాటి చేతిని పైకెత్తి తలకు పైభాగంలో వ్రేలాడుతున్న పట్టుదారంలో తగిలించి కొద్దిగా ఊపుతూ "జ్ఞానం ఉన్నవా డెవడూ మాంగల్యం కొనేటప్పుడైనా: అమ్మేటప్పుడైనా గూడా బేరమాడడు; అసలు భగవంతుడు మిమ్మల్ని ఈ స్థితిలో పెట్టిందిందుకే'' అన్నాడు

"చాలా బాగా చెప్పారు; ఒక్క తాళిబొట్టు వద్దనేగాదు; పూలు పసుపు కుంకం ఇలాంటి మంగళ ద్రవ్యాలు కొనేటప్పుడు కూడా బేరమాడడం అనుచితం"

అన్నాడో కాంపౌండు ప్రక్కనే. అతడాలాంటి మాటలు రెండు మూడైనా చెబితేనే గానీ అతడు కొనాలనుకొన్న కాసుల పేరు బేరం తెగదు.

కన్నయ్యకు బేరమాడే ఓపిక లేదు కుందనపు బంగారాన్ని కూటి నీళ్ళకు ధారపోసేవాళ్ళుండగా చావు బ్రతుకుల్లో సవరపు బంగారం చౌకగా అమ్ముకున్నా నష్టం లేదనిపించింది: చివరికి పదహారు రూపాయలకు అమ్మివేసి ఆ డబ్బుతో తనవద్ద ఉన్న రెండు చీటీల లోనూ ఒకదాన్నిచ్చి మందు తీసుకొన్నాడు. ఒక్క పరుగుతో ఆస్పత్రికి వచ్చాడు. వసారాలో చింతాయమ్మ లేదు ప్రక్కనున్న ఒకామె చెప్పింది. ఆమె కళ్ళు తిరిగి పడిపోతే లోనికి తీసుకెళ్ళారని; బహుశా నొప్పులు ప్రారంభమై ఉంటుందని; ఈ లోగా నర్సు వచ్చింది కన్నయ్య చేతిలోని ఇంజెక్షన్ తీసుకొని "మరొక్క టెక్కడ?" అంటూ ప్రశ్నించింది అతడు డబ్బులేక....'' అంటూ ప్రారంభించగా ఆమె లోపలకు వెళ్ళిపోయింది.

కన్నయ్య స్తంభానికి చేరగిలబడి నిలుచున్నాడు.

"చెల్లెలి కిప్పుడు సూదివేస్తారు. ఆమె బ్రతుకుతుంది. చింతాయి కిప్పుడే నొప్పులు ప్రారంభమైనాయి; దేవుని దయవల్లా పాలువేరుగా నీరు వేరుగా ఐతే ఏదో బ్రతికిపోతాము. ఏరుకుతినే కోడి ముక్కులో ముల్లు గుచ్చుకొన్నట్లు ఈ లాంటి కష్టాలను నా మీద మోపితే ఎట్లా? ఓ భగవంతుడా! అవసరమైతే నా ఆయుస్సులో కావలసినంత తీసుకో; మమ్మల్ని ముగ్గురిని బ్రతికించు; లేదా నేడే నన్ను నీ వద్దకు తీసుకపో; నా చెల్లెలినీ చింతాయిని బ్రతికించు. నేనిప్పుడే చచ్చిపోతాను; ఈ క్షణంలోనే చనిపోతాను; వారు చేసిన పాపాలనంతా నా భుజాలపై ఉంచు నేను భరిస్తాను; నా చెల్లెలి గుండె జబ్బును నాకివ్వు ఆ బాధను నేను అనుభవిస్తాను'' అంటూ కళ్ళుమూసుకొని ధ్యానిస్తున్నాడు,

ఇంతలో లోపలినుండి కెవ్వు: మంటూ ఏడుపు విన్పించింది; నర్సు బయటకు వచ్చి అన్నది "మగవాడెప్పుడూ ఇంతే; రెండు ఇంజక్షన్లు తీసుకరమ్మంటే

ఒకదానికే డబ్బుంది అన్నావు, ఆ ఒక్కటీ నీ భార్యకు తెచ్చావు కానీ నీ చెల్లెలకు తెచ్చావా? అంత ద్రోహం కనుకనే ఫలించకపోయింది, ఇపుడేం లాభం? బిడ్డ ప్రాణంతో బయటపడింది కానీ తల్లిపోయింది."

కన్నయ్య నిలువునా కొయ్యబారిపోయాడు, పదిక్షణాలపాటు స్తంభించి "ఏమన్నావమ్మా! నేను తెచ్చింది నా చెల్లెలకే అయ్యో! నా తెలివి మండిపోయింది, ఒక చీటి బదులు మరో చీటి యిచ్చాను" అంటూ కుప్పగా స్థంభానికి దిగజారుతూ క్రింద పడ్డాడు.

ఆయావేగంలో ఆ తొందరపాటులో ఆతికమకల్లో చెల్లికి కావలసిన మందు చీటికి బదులు భార్యకు కావలసిన మందు చీటి యిచ్చాడు; తా నింకా చెల్లికే సూది వేస్తున్నారనుకొన్నాడు.

"నానూ...." అంటూ లోపలికి పోబోయాడు· నానమ్మ ఎగీడ్చు కొంటున్నది అన్న కేక ఎక్కడో పాతాళంనుండి వినబడ్డట్లుతోచి పైకిలేవబోయి అట్లే వాలిపోయింది కన్నయ్య వెళ్ళి మంచం ముందు నిలబడ్డాడు నానమ్మ నయనాలలో వెలుగులు ఆరిపోయాయి; ప్రక్కన ఉన్న పాకీ పిల్ల "ఏడవకోయ్.... నిన్నే.... ఆసుపత్రిలో ఏడవకూడదంటూ" శవంపై బట్టను కప్పివేసింది.

కన్నయ్య కళ్ళు బూచులు క్రమ్మాయి పావుగంటకల్లా రెండు శవాలను, భూమి మీద పడ్డప్పటినుండి ఓ భగవంతుడా! ఎందు కీ నరకకూపంలోకి నన్ను పడవేశావు అయ్యో! ఆయ్యో! ఆయ్యయ్యో!" అంటూ విలపిస్తున్న పసికూనను కన్నయ్యకు అప్పగించారు, ధర్మాసుపత్రివారు. కన్నయ్య పిచ్చివాడిలా ఆ చిన్న కూనవైపు చూశాడు· వాని కళ్ళు నానమ్మ కళ్ళులాగే ఉన్నాయి పెదవులు అచ్చం చింతాయివే కన్నయ్య వెర్రిగా నవ్వుతూ.... "ఒరేయ్ నీకు చెల్లెకావాలా? పెళ్ళాం

కావాలా? ఎవరు కావాలి.... ఎవరు? ఎవర్రా? ఎవరు?" అంటూ గట్టిగా అరచాడు. ఆ ముప్పై నిమిషాల వయస్సుగల పసికూన రెండు శవాల మధ్యనుండి రెండు చేతులనూ రెండు ప్రక్కలా పారజాచి కెవ్వుమన్నాడు .... చెట్టుమీది కాకి ఆ కేక వినికావ్ మంటూ ఎగిరి పోయింది. సూర్యుడు అస్త మించాడు చుక్కలు తొంగి చూచాయి.

23-11-1955 ఆంధ్రప్రభ సచిత్ర
వార పత్రికలో ప్రచురితం

రమణా ప్రెస్ పార్కువ్యూ హైరోడ్, చిత్తూరు.